సాక్షి నిర్మల్
గురువారం । 23 । మే । 2024



ఇక 'స్థానిక' సమరం!

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని సీఎం తెలపడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. 8లో▸



ఆక్రమణలు.. అవస్థలు

నిర్మల్‌లో చిరువ్యాపారులు ఇరువైపులా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.5 /29.9

చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విరబూసిన మే పుష్పం



నిర్మల్‌టౌన్: మే నెలలో మాత్రమే వికసించే మే పుష్పం నిర్మల్ పట్టణంలోని వివేక్‌నగర్‌లో బుధవారం విరబూసింది. కాలనీకి చెందిన ఆదుముల్ల మమత– శ్రీహరి నివాసంలో ఈ పుష్పం వికసించింది. ఈ పుష్పాన్ని చూసేందుకు చుట్టుపక్కల వారు వస్తున్నారు.

రేపు పాలిసెట్

నిర్మల్ రూరల్: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో 350 మందికి, బాలికల జూనియర్ కళాశాలలో 456 మందికి, బాలుర జూనియర్ కళాశాలలో 456 మందికి, డిగ్రీ కళాశాలలో 300 మందికి, సోఫీనగర్ గురుకుల పాఠశాలలో 384 మందికి సెంటర్ ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావొద్దని సూచించారు.

పకడ్బందీగా రక్త నమూనాల సేకరణ

- ప్రపంచ ఆరోగ్య సంస్థ రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ శిరీష



రక్త నామూనాలు పరిశీలిస్తున్న డాక్టర్ శిరీష

లోకేశ్వరం: గ్రామాల్లో బోధకాలుకు సంబంధించిన రక్త నామూనాల సేకరణ పకడ్బందీగా చేపట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ శిరీష అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రక్త నమూనాల సేకరణకు సంబంధించిన రికార్డులను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా శిరీష మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి రక్త నాములు సేకరించాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు రక్త పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆమె వెంట వైద్యురాలు తేజస్విని, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, ఏఎన్ఎం స్వప్న ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అక్షయ్

నిర్మల్‌టౌన్: గోవాలో నిర్వహించిన గోవా ఇంటర్నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్–2024 లో నిర్మల్ వాసి ప్రతిభ కనబర్చాడు. జిల్లా కేంద్రంలోని ఈద్గాం కాలనీకి చెందిన ధ్యాయత్ అక్షయ్ తెలంగాణ తరఫున పుంసే, కుర్గి పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించాడు. బంగ్లాదేశ్‌కు చెందిన ప్రపంచ కరాటే అసోసియేషన్ మాస్టర్ రాణా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నాడు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన అక్షయ్‌ను, ఆయన గురువు నాగరాజును పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

ఘనంగా భాగ్యరెడ్డివర్మ జయంతి



భాగ్యరెడ్డివర్మకు నివాళులర్పిస్తున్న అధికారులు

నిర్మల్ రూరల్: దళితుల అభివృద్ధికి విశేష కృషి చేసిన భాగ్యరెడ్డివర్మ 136 జయంతి వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్సీ డీవో రాజేశ్వర్‌గౌడ్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దళితుల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ ఫైల్ ఏమైంది?

- నిర్మల్, భైంసా పీహెచ్‌డబ్ల్యూ పోస్టుల్లో అవకతవకలపై కదలిక
- తాజాగా అప్పటి కమిషనర్లపై వేటు
- కీలక ఫైల్ మాయంపై కలెక్టర్ ఆగ్రహం



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం

నిర్మల్: రెండేళ్లక్రితం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన నిర్మల్ మున్సిపాలిటీలోని 44 పబ్లిక్ హెల్త్ వర్కర్(పీహెచ్‌డబ్ల్యూ) పోస్టులు, భైంసాలో 18 పోస్టుల వ్యవహారం మళ్లీ తెరపైకొచ్చింది. ఈ ఘటనలో బాధ్యుడైన అప్పటి నిర్మల్ మున్సిపల్ (ప్రస్తుత తుర్కయాంజల్) కమిషనర్ సత్యనారాయణరెడ్డిని, భైంసా అప్పటి కమిషనర్ అలీంను సీడీఎంఏ దివ్యదేవరాజన్ మంగళవారం సస్పెండ్ చేశారు. మరోవైపు నిర్మల్ ఘటనకు సంబంధించి కీలక ఫైల్ మిస్ అయినట్లు తెలుస్తోంది. నాడు ఉద్యోగాల నియామకాల్లో భారీగా అవకతవకలు, బంధుప్రీతీ, ముడుపుల వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. రాజకీయంగానూ దుమారం రేపింది. ఎట్టకేలకు చర్యలు చేపట్టడం, ఇదే సమయంలో ఫైల్ మిస్ కావడం చర్చనీయాంశమైంది.

నోటిఫికేషన్ నుంచే..

గ్రేడ్–2 మున్సిపాలిటీగా ఉన్న నిర్మల్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లా కేంద్రమైన తర్వాత ఉన్న కార్మికులపై భారం పెరిగింది. ఈక్రమంలో పబ్లిక్ హెల్త్‌వర్కర్(పీహెచ్‌డబ్ల్యూ) పోస్టుల భర్తీకి మున్సిపల్ శాఖ అనుమతి ఇచ్చింది. ఈమేరకు 2021 డిసెంబర్‌లో నిర్మల్ మున్సిపాలిటీలో 44 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఒక పోస్టును ఎస్టీ–1, ఓసీ జనరల్–18, ఓసీ మహిళ–07, ఎస్సీ జనరల్–04, ఎస్సీ మహిళ–01, బీసీ(ఏ) జనరల్–03, మహిళ–03, బీసీ(బీ) జనరల్–03, మహిళ–01, బీసీ (డీ) జనరల్–02, బీసీ(ఈ) జనరల్–01 చొప్పున కేటాయించారు. మున్సిపల్ నుంచి వచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఒక్కో పోస్టుకు 20 మంది చొప్పున 880 మంది నిరుద్యోగులకు ఉపాధికల్పన శాఖ కాల్‌లెటర్లు పంపింది. వీరికి 2022, ఫిబ్రవరి 14న కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలను నిర్వహించారు. అనంతరం రిజర్వేషన్, రోస్టర్, మెరిట్, జీవోల ప్రకారం అభ్యర్థుల ఎంపిక ఉంటుందని చెప్పారు. కానీ.. ఇంటర్వ్యూతో సంబంధం లేకుండా తమకు నచ్చిన వారిని ఎంపిక చేయడం సంచలనంగా మారింది.

భైంసాలోనూ..

భైంసా మున్సిపాలిటీలోనూ పీహెచ్‌డబ్ల్యూ పోస్టుల నియామకాలను చేపట్టారు. ఇక్కడ 18 పోస్టులను భర్తీ చేశారు. నిర్మల్‌లో జరిగినట్లే ఇక్కడా విధివిధానాలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టినట్లు తేలింది. దీంతో అప్పట్లో ఇక్కడ కమిషనర్‌గా చేసిన ప్రస్తుత బాన్సువాడ కమిషనర్ అలీంను కూడా సీడీఎంఏ సస్పెండ్ చేశారని తెలిసింది.

ఆరోపణలు.. ఆందోళనలు..

44 పోస్టుల వ్యవహారంలో భారీగా ముడుపులు తీసుకుని అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారం రాజకీయంగానూ సంచలనంగా మారింది. అప్పట్లో అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులపై ప్రతిపక్షపార్టీలు ఆరోపణలు చేయడంతోపాటు మున్సిపల్ ముట్టడి చేపట్టాయి. ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లో ముడుపులు తీసుకున్నారని, మున్సిపల్‌కు చెందిన ప్రజాప్రతినిధుల కుటుంబసభ్యులు, బంధువులు, అనుయాయులకే పోస్టులు కేటాయించారని నిరసనలు కొనసాగాయి.

రద్దు చేస్తున్నట్లు ప్రకటన..

ఇదిలా ఉంటే.. నిర్మల్‌లో 44 పోస్టులపై ఆరోపణలు, ఆందోళనలు వెల్లువెత్తడంతో అప్పటి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి 2022, మే 27న సదరు పోస్టులను నిలిపివేయిస్తున్నట్లు చెప్పారు. అప్పటి కలెక్టర్ ముషరఫ్‌అలీకి ఆదేశాలు జారీ చేశారు. ఈక్రమంలో అదేరోజు అప్పటి కలెక్టర్ ముషరఫ్‌అలీ పోస్టుల అవకతవకలపై విచారణ చేపట్టాలని అప్పటి నిర్మల్ ఆర్డీవోకు ఆదేశించారు. కానీ ఆ తర్వాత ఎలాంటి విచారణ నివేదిక ఇవ్వలేదు.

ఫైల్ ఎక్కడ మిస్సైనట్టు..

మున్సిపల్ పోస్టుల వ్యవహారంలో ఓవైపు అప్పటి కమిషనర్ సత్యనారాయణరెడ్డి సస్పెండ్ కాగా, మరోవైపు ఈ అంశానికి సంబంధించిన ఫైల్ కలెక్టరేట్‌లో మిస్సయినట్లు తెలుస్తోంది. దీనిపై కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలిసింది. ఆ ఫైల్ ఆఫీస్ మార్పిడి సమయంలో మిస్ అయిందా.. లేక కోర్టులకు వెళ్లినప్పుడు మర్చిపోయారా.. అనేవిషయంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కీలక ఫైల్ కనిపించకపోవడం, కమిషనర్ సస్పెండ్ కావడంతో 44 పోస్టుల వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

కోర్టుకు వెళ్లడంతో..

44 పోస్టుల వ్యవహారంపై పలువురు హైకోర్టుకు వెళ్లారు. నోటిఫికేషన్, పోస్టుల కేటాయింపులపై కొందరు వెళ్లగా, తమకు కేటాయించిన పోస్టులను ఇవ్వాలంటూ మరికొందరు కోర్టు తలుపుతట్టారు. ఈ అంశంలోనే ఇటీవల నోటిఫికేషన్ సమయంలో ఉన్న అప్పటి అధికారులకూ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎంపికైన వారికి వేతనాలివ్వాలని సూచించింది. మరోవైపు నోటిఫికేషన్ సమయంలో అప్పటి అధికారులు ఫైనాన్స్ క్లియరెన్స్ తీసుకోలేదని తెలుస్తోంది. ఈక్రమంలోనే వారికి వేతనాలు ఇవ్వడం లేదని సమాచారం. ఇందులో భాగంగా పోస్టుల భర్తీపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అప్పటి నిర్మల్, ప్రస్తుత రంగారెడ్డిజిల్లా తుర్కయాంజల్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డిని మంగళవారం సస్పెండ్ చేసింది.

ధాన్యం తూకంలో జాప్యం చేయొద్దు

- చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి
- నీటిపారుదల శాఖ కార్యదర్శి, ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్
- కలెక్టర్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



న్యూబొప్పారంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

నిర్మల్ రూరల్/సోన్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడంలో కేంద్రాల నిర్వాహకులు అలసత్వం వహించొద్దని ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. నిర్మల్ రూరల్ మండలం రత్నపూర్ కాండ్లిలో, సోన్ మండలం న్యూబొప్పారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో సదుపాయాల గురించి తెలుసుకున్నారు. కేంద్రంలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, కొనుగోలు చేయాల్సిన ధాన్యం వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తడిసిన ధాన్యం తూకం వేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. తరుగు ఏమైనా తీస్తున్నారా అని రైతులను అడుగగా, ఏమీ లేదని రైతులు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యం వివరాలు ట్యాబ్ ఎంట్రీ చేయాలన్నారు. తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కేంద్రంలో రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా హమాలీలు, రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడ్‌కు కూలీలు సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 228 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1,02,698 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కేంద్రాల్లో రైతులకు సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియను క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని జిల్లా అధికారుల వరకు ప్రతి ఒక్కరూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వారి వెంట అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి నందిత, డీఆర్డీవో విజయలక్ష్మి, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ, డీఏవో అంజిప్రసాద్, మార్కెటింగ్ ఏడీ అశ్వాక్, డీసీవో నర్సయ్య, ఎంపీడీవోలు గజానంద్, సురేష్, ఎంపీవో గంగామణి, తహసీల్దార్లు సంతోష్, మల్లేశ్, ఐకేపీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

అదనపు కలెక్టర్ సందర్శన..

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్, బాదన్‌కుర్తి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, పట్టణంలోని మార్కెట్ యార్డులోని కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ బుధవారం సందర్శించారు. వాతావరణ మార్పుల దృష్ట్యా తూకంలో జాప్యం చేయకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యం ఎప్పటికప్పుడు లారీల్లో మిల్లులకు తరలించాలని ఆదేశించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్‌హైమద్, తహసీల్దార్ శివరాజ్, ఆర్ఐ రాజేశ్వర్, సెక్రటరీ సయ్యద్ అజాం అలీ తదితరులు ఉన్నారు.

నిర్మాణం నిబంధనల మేరకు లేదని..



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ వీవీ.రమణమూర్తి, పక్కన బాధితుడు రాధేశ్యాం(నిలబడిన వ్యక్తి)

- రూ.30 వేలు డిమాండ్ చేసిన భైంసా మున్సిపల్ కమిషనర్
- బిల్ కలెక్టర్ ద్వారా ఒత్తిడి..
- అంత ఇచ్చుకోలేనన్న బాధితుడు.. కుదరదన్న కమిషనర్..
- ఏసీబీని ఆశ్రయించడంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



ఏసీబీకి పట్టుబడిన కమిషనర్, బిల్ కలెక్టర్

భైంసాటౌన్: భవనం నిర్మించిన మూడేళ్ల తర్వాత.. ఆ భవనం నిబంధనల ప్రకారం నిర్మించలేదని లంచం డిమాండ్ చేశాడు భైంసా మున్సిపల్ కమిషనర్. ఆస్తిపన్ను తక్కువ కడుతున్నారని, లక్షల రూపాయల బిల్లు చెల్లించాలని భయపెట్టారు. తక్కువ బిల్లు కట్టాలంటే తనకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈమేరకు బిల్ కలెక్టర్ ద్వారా ఒత్తిడి చేశాడు. అంత ఇచ్చుకోలేని బాధితుడు బతిమిలాడినా వినలేదు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు.

రెండేళ్ల క్రితం నిర్మాణం..

ఏసీబీ డీఎస్పీ వీవీ.రమణమూర్తి తెలిపిన వివరాలి ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన లాలాసరఫి రాధేశ్యాం భైంసా–నిర్మల్ జాతీయ రహదారి పక్కన 2022లో కమర్షియల్ భవన నిర్మాణం చేపట్టాడు. ఈమేరకు మున్సిపాలిటీ నుంచి అనుమతులు కూడా తీసుకున్నాడు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.790 ఆస్తిపన్ను సైతం ఇటీవలే చెల్లించాడు. అయితే ఆ భవనం నిబంధనల మేరకు లేదని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు బిల్ కలెక్టర్ విద్యాసాగర్‌రావు ద్వారా ఈనెల 16న నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం భవనానికి లక్షల ఆస్తిపన్ను చెల్లించాలని, ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని పేర్కొన్నాడు. దీంతో రాధేశ్యాం బిల్ కలెక్టర్‌ను కలిశాడు. పన్ను చెల్లించొద్దంటే.. కమిషనర్‌కు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు.

అంత ఇవ్వలేనని..

దీంతో బాధితుడు ఈనెల 18న నేరుగా కమిషనర్ వెంకటేశ్వర్‌రావును కలిశాడు. రూ.30 వేలు ఇచ్చుకోలేనని బతిమిలాడాడు. కానీ, కమిషనర్ అడిగినంత ఇచ్చుకోవాల్సిందే అని స్పష్టం చేశాడు. దీంతో రాధేశ్యాం ఏసీబీని ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు బుధవారం రూ.30 వేలు తీసుకుని మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాడు. నగదు బిల్ కలెక్టర్ విద్యాసాగర్‌కు ఇవ్వగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్‌పై కేసు నమోదు చేశారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెడతామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే తమను సంప్రదించాలని సూచించారు. కరీంనగర్ డీఎస్పీ 91543 8854, ఆదిలాబాద్ డీఎస్పీ 9154388963 నంబర్లలో కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నా ప్రమేయం లేదు..

భవన నిర్మాణ విషయమై ఎలాంటి లంచం డిమాండ్ చేయలేదు. ఇందులో నా ప్రమేయం లేదు. నిబంధనల ప్రకారం పన్ను చెల్లించకపోవడంతోనే నోటీసులు ఇచ్చాం. లంచం డిమాండ్ చేశామనడం అబద్ధం. **– వెంకటేశ్వర్‌రావు, కమిషనర్**

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రవేశాలు
- ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన వారే అర్హులు
- ఈనెల 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం

నిర్మల్‌చైన్‌గేట్: పేద విద్యార్థులకు ప్రభుత్వం కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రతిభ ఉన్న విద్యార్థుల ఉన్నత చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకావొద్దనే ఉద్దేశంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'కార్పొరేట్ విద్య' పథకం అమలు చేస్తోంది. ఈ పథకం కింద విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీల్లో రిజర్వేషన్ల వారీగా ప్రవేశాలు కల్పిస్తోంది. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ–ఈ, బీసీ–సీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు అర్హులు.

కార్పొరేట్ కళాశాలల్లో..

పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఇంటర్మీడియట్ కార్పొరేట్ కళాశాలల్లో చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఎంపికైన ప్రతీ విద్యార్థికి ఫీజు కింద రూ.35 వేలు, ఖర్చుల కింద ఏటా రూ.3 వేలు అందిస్తారు. ఉచితంగా వసతి సదుపాయం కల్పిస్తారు. జిల్లాతోపాటు పథకం కింద ఎంపికైన రాష్ట్రంలోని ఏకార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికైనా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే వీలుంది.

వీరు అర్హులు..

పదో తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 7 జీపీఏ ఆపైన పాయింట్లు సాధించి ఉండాలి. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ప్రభుత్వ గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, నవోదయ పాఠశాలల్లో చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. కేటగిరీల వారీగా ఎక్కువ దరఖాస్తులు వస్తే మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

దరఖాస్తులు ఇలా..

అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈపాస్ వెబ్‌సైట్‌లో కార్పొరేట్ అనే ఆప్షన్ క్లిక్ చేసి దరఖాస్తులో వివరాలు నమోదు చేయాలి. విద్యార్థుల కులం, ఆదాయం ధ్రువపత్రాలు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, పదోతరగతి మెమో, ఆధార్ కార్డు, వసతి గృహాల్లో 8, 9, 10వ తరగతి చదివితే హాస్టల్ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌ఫొటోలు, రేషన్ కార్డు జిరాక్స్ అప్‌లోడ్ చేయాలి. దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఇక గ్రామీణ ప్రాంత విద్యారుల తల్లిదండ్రుల ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.2 లక్షలకు మించొద్దు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్, కేజీబీవీల్లో పదో తరగతి చదివి 7.0 జీపీఏ ఆపైగా జీపీఏ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు అర్హులు. గతేడాది జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వివిధ కార్పొరేట్ కళాశాలల్లో సీటు పొందారు.

– రాజేశ్వర్‌గౌడ్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి

కేవీకే స్వర్ణోత్సవం



బెల్లంపల్లి కేవీకే కార్యాలయ భవనం

- దేశంలో ఏర్పాటై 50వసంతాలు పూర్తి
- వేడుకలకు సర్వం సిద్ధం
- రైతులకు అవగాహన కార్యక్రమాలు

బెల్లంపల్లి: రైతులకు ఆధునిక వ్యవసాయ సలహాలు, శాస్త్ర, సాంకేతిక అంశాలను అందించాలనే ప్రధాన లక్ష్యంతో దేశంలో ఏర్పడిన కృషి విజ్ఞాన కేంద్రాలు(కేవీకే) యాభై వసంతాలు పూర్తి చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో స్వర్ణోత్సవ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, బెల్లంపల్లి కేవీకేల్లో రైతు శిక్షణ తరగతులు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు. స్వర్ణోత్సవ జయంతి జ్యోతి గురువారం బెల్లంపల్లికి చేరుకోనుండగా.. ఘనస్వాగతం పలకడానికి కేవీకే యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

పుదుచ్చేరిలో మొదటగా..

భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో 1974 మార్చి 21న దేశంలో తొలిసారిగా పుదుచ్చేరిలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభించారు. దేశంలో పది జోన్లు ఏర్పాటు చేసి వీటి పరిధిలో 735 కేవీకేలను విస్తరించారు. పదో జోన్ పరిధిలో పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను చేర్చారు. ఈ జోన్‌లో 72 కేవీకేలు ఉండగా రాష్ట్రంలో 16 రైతాంగానికి వ్యవసాయ సేవలు అందిస్తున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ కేంద్రంగా కేవీకేను ప్రారంభించగా, 2018 మార్చి 17న ఢిల్లీ నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రధానమంత్రి మోదీ బెల్లంపల్లి కేవీకేను ప్రారంభించారు. రైతులకు వ్యవసాయ సేవలు, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయి.

స్వర్ణోత్సవ జయంతి జ్యోతి రాక

స్వర్ణోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలో గత నెల 22న స్వర్ణోత్సవ జయంతి జ్యోతిని నల్గొండ జిల్లా కంపసాగర్ కేవీకేలో ప్రారంభించారు. ఇప్పటివరకు గడ్డిపల్లి, వైరా, కొత్తగూడం, మల్యాల్, మామ్నూర్, జమ్మికుంట, రామగిరిఖిల్లా కేవీకేకు చేరుకోగా అక్కడి నుంచి బెల్లంపల్లి కేవీకేకు తీసుకు రానున్నారు. ఈ నెల 24వరకు శిక్షణ తరగతులు, వ్యవసాయ కార్యక్రమాలు నిర్వహించి రైతులను చైతన్యవంతం చేస్తారు. 25న బెల్లంపల్లి నుంచి స్వర్ణోత్సవ జయంతి జ్యోతి బయల్దేరి ఆదిలాబాద్ కేవీకేకు చేరుకుంటుంది. అక్కడ 27వరకు కార్యక్రమాలు నిర్వహించి 28న రుద్రూర్ కేవీకేకు తీసుకెళ్తారు.

రైతాంగానికి శిక్షణ తరగతులు

బెల్లంపల్లి కేవీకేలో స్వర్ణోత్సవ జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. వ్యవసాయంలో శాస్త్ర, సాంకేతిక, వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ, చీడపీడల నివారణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తారు. ప్రదర్శనలు, క్షేత్ర దినోత్సవాలు నిర్వహిస్తారు. బెల్లంపల్లి కేవీకేలో ఇప్పటివరకు 250కి పైగా రైతు క్షేత్రాల్లో నూనెగింజలు, పప్పు దినుసుల పంటలపై ప్రథమ శ్రేణి ప్రదర్శనలు నిర్వహించారు. గ్రామాల్లో సర్వే చేసి ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఇప్పించారు. మహిళా రైతులకు గృహ విజ్ఞాన సంబంధిత కార్యక్రమాలు, విత్తనోత్పత్తిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు, ఎస్సీ, ఎస్టీ, ఉప ప్రణాళికతో వ్యవసాయ రంగంపై యువతను ఆకర్షించేందుకు శిక్షణ తరగతులు అమలు చేస్తున్నారు.

ఆదాయం రెట్టింపే లక్ష్యం



పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు పరిచయం చేస్తున్నాం. పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తూ అధి క దిగుబడులు సాధించడానికి తోడ్పడుతున్నాం. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి కృషి చేస్తున్నాం. కేవీకే స్వర్ణోత్సవ వేడుకలను రైతులు విజయవంతం చేయాలి. – కోట శివకృష్ణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, బెల్లంపల్లి

గౌరవ వేతనం ఇవ్వాలి

- పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌తో పీఆర్టీయూతెలంగాణ ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్:అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించిన సెక్టోరల్ అధికారులు ఆపై ఉన్నతాధికారులకు ఒక నెల వేతనం గౌరవ వేతనంగా ఇవ్వాలని పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వై.సాయన్న మాట్లాడారు. పోలింగ్ సిబ్బందికి 2 రోజుల శిక్షణ, 3 రోజుల పని దినంగా మొత్తం 5 రోజుల పని దినాలుగా భావించి, గౌరవ భృతితో పాటు ఐదు రోజుల సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రాల హరిప్రసాద్, నాయకులు వొడ్నాల రవిరాజ్, సోప్పర్‌వార్ శంకర్, సరికొండ శ్రీనివాస్, ఆడే నూర్‌సింగ్, మోహన్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పక్షి ప్రేమికుడు వెంకటేశ్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్

బోథ్: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా బుధవారం హన్మకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో బోథ్ పట్టణానికి చెందిన పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్‌కు జీవ వైవిధ్య అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ప్రశంసాపత్రం అందుకున్నారు. పర్యావరణం, ప్రకృతి, పక్షులు తదితర అంశాలపై ఆయన చేసిన అవగాహన కార్యక్రమాలకు గాను అవార్డును అందించారు. పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షులు పురుషోత్తం అవార్డును అందించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మనుబోతు మృతి



చెరువులో మనుబోతు కళేబరం

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ పెద్ద చెరువులో ప్రమాదవశాత్తు నీటిలో పడి మనుబోతు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వ్యవసాయపనుల కోసం వెళ్లిన రైతులు మూడు రోజుల క్రితం సూర్యాపూర్ చెరువు తూము వద్ద మనుబోతు మృతి చెందినట్లు గమనించారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రాజుకు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి స్పందించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో బుధవారం సాయంత్రం ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, ఎఫ్‌బీవో హరిలత ఘటనా స్థలానికి చేరుకున్నారు. పశువైద్యాధికారి ప్రకాశ్ పంచనామా నిర్వహించారు. నీరు తాగేందుకు వచ్చిన మనుబోతు ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందినట్లు ఎఫ్ఆర్‌వో రాథోడ్ రమేశ్ తెలిపారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

భైంసాటౌన్: మండలంలోని ఖత్గాంలో తరచూ దొంగతనాలకు పాల్పడుతున్న దుండగుడిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మంగళవారం అర్ధరాత్రి పంటపొలాల్లోని కేబుల్ వైర్లు, సోలార్ బ్యాటరీలు దొంగిలిస్తుండగా, గమనించిన కొందరు గ్రామస్తులకు సమాచారమిచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకుని దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

చోరీకి గురైన ఆటో లభ్యం

కైలాస్‌నగర్: చోరీకి గురైన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్ కాలనీకి చెందిన విక్కి ఈనెల 19న రాత్రి తన ఇంటి ఎదుట ఆటో పార్కింగ్ చేయగా అది చోరీకి గురైంది. కాగా, అదే కాలనీకి చెందిన నర్వాడే గంగాధర్, రౌతు సచిన్, లోనే సమధాన్ ఆటోను దొంగిలించి విక్రయించేందుకు మహారాష్ట్రకు వెళ్లారు. అక్కడ దానిని ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో ఆదిలాబాద్ పట్టణానికి తిరిగి వచ్చారు. ఇక్కడ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో వారిని పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆటోను పట్టుకున్న వారిలో హెడ్‌కానిస్టేబుల్ మదన్, నరేశ్, క్రాంతికుమార్ ఉన్నారు.

ఇక 'స్థానిక' సమరం!

- జూలైలో ఎన్నికల నిర్వహణకు ఛాన్స్
- కులగణన చేపడితే మరింత జాప్యం
- ముగిసిన సర్పంచుల పదవీ కాలం
- గ్రామపంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన



వదూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

నేరడిగొండ/నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. జూన్ 4న లెక్కింపు నిర్వహించనున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించిన విషయాలు సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని సూత్రప్రాయంగా సీఎం తెలపడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగియగా.. 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్నికల నిర్వహణకు బ్రేక్ పడింది. మరికొద్ది రోజుల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం కూడా ముగియనుంది. ఈ నేపథ్యంలో సీఎం ప్రకటనపై పల్లెల్లో నాయకులు, ఆశావహుల సందడి మొదలైంది.

ఈసారి అన్ని ఎన్నికలు ఒకేసారి!

సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలను గతంలో మూడు దశల్లో నిర్వహించారు. మొదట సర్పంచ్, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియగా, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం జూలై 3వరకు, జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం జూలై 5 వరకు ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ఈసారి మూడు విభాగాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

కులగణనకు ఉత్తర్వులు జారీ

గత ఎన్నికల సమయంలో అధికార కాంగ్రెస్ కులగణన చేపడతామని హామీ ఇచ్చింది. ఈమేరకు ఇటీవల ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ ప్రక్రియ కోసం సుమారు రెండు నెలలు పట్టే అవకాశముంది. అయితే కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఆలోచన ఉంటే మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రానున్న స్థానిక సమరంలో రిజర్వేషన్ల ప్రక్రియ ఎలా ఉంటుందనే విషయమై నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు.

సిద్ధంగా ఉండాలని ఆదేశాలు

గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అందుకోసం యంత్రాంగం సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో జిల్లా అధికారులు గ్రామపంచాయతీలకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలు ప్రభుత్వానికి పంపించారు. ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు ఎన్ని ఉన్నాయనే వివరాలు కూడా తెలియజేశారు. అవసరమైతే ఆంధ్రప్రదేశ్ నుంచి బ్యాలెట్ బాక్సులు తెచ్చుకోవాలని నిర్మల్ జిల్లాకు ఆదేశాలు అందాయి.

బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు

గ్రామపంచాయతీల ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించనున్నారు. సర్పంచులను నేరుగా ఎన్నుకోనుండగా, ఉపసర్పంచ్‌ను పరోక్ష పద్ధతిన ఎన్నుకుంటారు. వార్డు సభ్యులు, సర్పంచ్ ఎన్నికల కోసం ప్రతీ వార్డుకు ఒక పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుడికి వేర్వేరుగా తెలుపు, గులాబీ రంగు బ్యాలెట్ పేపర్లను ముద్రించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ఎన్నికలకు రాజకీయ పార్టీల గుర్తులుండవు. ముందుగానే ముగ్గురు, నలుగురు పేర్లతో కూడిన నమూనా బ్యాలెట్ పేపర్లను మూడు, నాలుగు విధాలుగా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

200 మందికో పోలింగ్ కేంద్రం

ప్రతీ 200 మందికో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ అధికారి ఉంటారు. అంతకుమించి ఓటర్లు ఆ వార్డులో 200 నుంచి 400మంది ఉంటే ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు సహాయ అధికారులను నియమిస్తారు. 400 నుంచి 650 మంది ఓటర్లుంటే ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు సహాయ అధికారులను నియమించాలని నిర్ణయించారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తారు.

జిల్లాల వారీగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు సభ్యుల స్థానాలు

జిల్లా	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు	ఎంపీపీలు	జీపీలు	వార్డు సభ్యులు
ఆదిలాబాద్	158	17	17	467	3,840
మంచిర్యాల	130	16	16	311	2,730
కుమురంభీం	123	15	15	334	2,874
నిర్మల్	156	18	18	396	3,336
మొత్తం	567	66	66	1,508	12,780

మంత్రిని కలిసిన గెస్ట్ లెక్చరర్లు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న గెస్ట్ లెక్చరర్లు

భైంసాటౌన్: సమస్యలు పరిష్కరించాలని బాసర ట్రిపుల్‌ఐటీ గెస్ట్ లెక్చరర్లు, ల్యాబ్ సిబ్బంది బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ.. 2018 నుంచి పనిచేస్తున్నా ప్రతి సెమిస్టర్‌కు ఇంటర్వ్యూలు నిర్వహించి తమకు అభద్రతా భావాన్ని కలుగజేస్తున్నారని తెలిపారు. వేసవిలో రావాల్సిన వేతనం అందించడంలేదని పేర్కొన్నారు. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామని మంత్రికి వివరించారు. తమను ఏటా ఆటో రెన్యూవల్ చేయాలని మంత్రికి విన్నవించారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

భైంసాటౌన్: ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సాలొమాన్‌రాజ్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్-2.0 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యసిబ్బందితో ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. ఉద్యోగులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్‌కుమార్, డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, కిరణ్‌కుమార్, హెల్త్ వలంటీర్లున్నారు.

మహిళను అవమానపరిచిన కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్: మహిళను అవమానపరిచిన కేసులో ఓ వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పోశెట్టి, బాధితురాలైన మహిళ ఒకే గ్రామానికి చెందిన వారు. సదరు మహిళ భర్త దాసరి పోశెట్టి దగ్గర 10 రోజుల్లో అప్పు తీరుస్తానని 2015లో రూ.10వేలు సూరిమెడ పోశెట్టి అప్పు తీసుకున్నాడు. తర్వాత ఎన్నిసార్లు అడిగినా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. 2016 ఫిబ్రవరి 26న దాసరి పోశెట్టి భార్య అయిన ఆమెకు సూరిమెడ పోశెట్టి వద్ద రావాల్సిన డబ్బులు తీసుకోమని చెప్పాడు. దీంతో ఆ మహిళ ఇంటి పక్కన గల మరో మహిళను వెంట తీసుకెళ్లి అతడి ఇంటికి వెళ్లి డబ్బులివ్వమని అడిగింది. దీంతో సూరిమెడ పోశెట్టి ఆ మహిళపై దురుసుగా ప్రవర్తించాడు. ఈ మేరకు ఆ మహిళ నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై రమణమూర్తి కేసు నమోదు చేశారు. పరిశోధన అనంతరం చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఏపీపీవో రామకృష్ణ ఆరుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి సాక్ష్యం రుజువు చేశారు. దీంతో నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్.. సూరిమెడ పోశెట్టికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు.

ఘనంగా పెందోర్ వంశస్తుల పెర్సాపెన్ పూజలు



కొత్త కోడళ్ల భేటీ నిర్వహిస్తున్న వంశ పెద్దలు

నార్నూర్: సూర్యవంశీ రాజ్ గోండు మెద్నికర్ పెందోర్ వంశస్తులు పెర్సాపెన్ మహాపూజను బుధవారం మండలంలోని ఖైరదాట్వా గ్రామ పొలిమేరలో ఘనంగా నిర్వహించారు. గ్రామం నుంచి పొలిమేర వరకు ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ఊరేగింపు చేపట్టారు. పెర్సాపెన్ పెద్ద దేవుడు వద్ద పెందోర్ వంశానికి చెందిన 23 మంది కొత్త కోడళ్లతో సంప్రదాయ భేటీ నిర్వహించారు. కార్యక్రమంలో పెర్సాపెన్ కటోడా నీలాశావ్, అర్జున్, ఆనందరావు, తుకారాం, సంతోష్, పెర్సాపెన్ పటేల్ బొజ్జు, గ్రామ పటేల్ నారంజీరావు, గ్రామ పెద్దలు తుకారాం, భగవంత్‌రావు, పెందోర్ వంశస్తులు, సోరియల్, దారియల్, భారీగా పాల్గొన్నారు.

గంజాయి కేసులో తొమ్మిది మంది అరెస్ట్

మోర్తాడ్: బంధువుల ఇంటికి శుభకార్యానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన ఆరుగురితోపాటు కమ్మర్‌పల్లికి చెందిన ఒకరు, నిర్మల్‌కు చెందిన మరో ఇద్దరు గంజాయి కేసులో అరెస్టు అయ్యారు. ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాలు.. కమ్మర్‌పల్లికి చెందిన ఎండీ ఆరీఫ్ ఇంట్లో శుభకార్యానికి హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ రహమాన్, ఎండీ అజర్, ఎస్‌కే శంషద్, సమీర్, ప్యార్శని వంశీవర్ధన్, ఎండీ సలీం పాషా హాజరయ్యారు. వీరు ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ ఈతవనంలో మంగళవారం గంజాయి తాగుతూ హంగామా చేశారు. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు వీరిని అరెస్టు చేశారు. వీరు నిర్మల్‌కు చెందిన షేక్ షాదుల్లా, సయ్యద్ అజారుద్దీన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు గుర్తించి, వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. 268 గ్రాముల గంజాయి, ఒక స్కార్పియో వాహనం, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి న్యాయ నిర్ణేతలుగా ఎంపిక



జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అర్హత సాధించిన క్రీడాకారులు

ఆదిలాబాద్: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జిల్లాకు చెందిన పలువురు అర్హత సాధించారు. జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలో ఈనెల 19నుంచి 21వ తేదీ వరకు తైక్వాండో న్యాయ నిర్ణేతల సెమినార్, పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కొరిగి, పూమ్సే విభాగాల్లో జిల్లాకు చెందిన తైక్వాండో మాస్టర్ అన్నారపు వీరేశ్, శృతి వీరేశ్, కన్య, మాధవి, గొంగళి శివకుమార్, వనిత రాథోడ్ జాతీయ స్థాయి న్యాయ నిర్ణేతలుగా అర్హత సాధించారు. ఈ మేరకు నిర్వాహకులు వీరికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి శివకుమార్, సాత్విక్, వనిత రాథోడ్, విరాజ్ తేజ బ్లాక్‌బెల్ట్, డాన్ వన్‌బెల్ట్ సాధించారు.

రేబిస్ కలకలం

దస్తురాబాద్: మండల కేంద్రంలో రేబిస్ కలకలం రేపుతోంది. మండల కేంద్రంలో ఇప్పటికే ఐదు బర్రెలు మృతి చెందాయి. మరోవైపు మరిన్ని బర్రెలకు వ్యాధి లక్షణాలు బయటపడుతున్నాయి. దీంతో పశువుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. పశువైద్యులు స్పందించి మండల కేంద్రంలో రేబిస్ వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని పశు యజమానులు కోరుతున్నారు.

బైకును ఢీకొన్న కారు

నర్సాపూర్ (జీ): మండలంలోని అర్లి (కే) హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట భైంసా నుంచి నర్సాపూర్ (జీ)కి వస్తున్న బైకును నిర్మల్ నుంచి భైంసా వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రాహుల్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

బెల్లంపల్లి: బెల్లంపల్లి పాత బస్టాండ్ ఏరియాలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పాత బస్టాండ్ ఏరియాలోని బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు ఉన్న తోపుడు బండిపై బుధవారం మధ్యాహ్నం 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి నిద్రకు ఉపక్రమించాడు. రాత్రి 8 గంటలకు కొందరు వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు. వడదెబ్బ తగిలి చనిపోయాడా, మరేదైనా కారణమా అనేది తెలియాల్సి ఉంది. వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపర్చారు.

'అకాల' బీభత్సం



కుంటాల: మండల కేంద్రంలో ధాన్యం కుప్పల్లో నిలిచిననీరు



తాంసి: ఉండం గ్రామ సమీపంలో విరిగిన విద్యుత్ స్తంభం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- రోడ్డుకు అడ్డంగా విరిగి పడిన చెట్లు
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- పలు చోట్ల ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- తీగలు తెగి నిలిచిన కరెంట్ సరఫరా
- పలు గ్రామాల్లో లేచిన ఇళ్ల పైకప్పులు



నేరడిగొండ: రోడ్డుపై విరిగిన చెట్లను జేసీబీ సాయంతో తొలగిస్తున్న గ్రామస్తులు



తాంసి: మండల కేంద్రంలో ఇంటిపై విరిగిపడిన ఈతచెట్టు



తాంసి: మండల కేంద్రంలో జొన్నపంటపై టార్పాలిన్ కప్పుతున్న రైతులు

తలమడుగు: జిల్లాలో బుధవారం ఈదురుగాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. తలమడుగు మండలంలోని ఉండం గ్రామ సమీపంలో 33 కేవీ విద్యుత్ పోల్ విరిగింది. దీంతో తాంసి, తలమడుగు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచింది. తాంసి మండలంతో పాటు తలమడుగు మండలంలోని సుంకిడి, ఉండం, లింగి, కుచులాపూర్, పల్సి బీ, పల్సి కే, సోనపూర్, కొత్తూర్, పునగూడా, ఝరి గ్రామాలకు విద్యుత్ అంతరాయమేర్పడింది. పునగుడ గ్రామంలో పలు ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. ఒక ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పల్సి బీలో, పల్సి కే లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పల్సి బీ గ్రామంలో గోవింద్, కిషన్, నవీన్, నూర్‌సింగ్, రాథోడ్ లాలు ఇంటి పైకప్పులు లేచిపోయాయి. మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రోడ్డుపై చెట్లు విరిగిపోయాయి. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిచాయి.

ఉట్నూర్ మండలంలో..

ఉట్నూర్‌రూరల్: మండలంలో బుధవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఆదిలాబాద్-మంచిర్యాల ప్రధాన రహదారికి ఇరువైపులా పాత ఉట్నూర్, నాగాపూర్ తదితర ప్రాంతాల్లో చెట్లు విరిగి రహదారికి అడ్డంగా పడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. మండలంలోని చిన్నుగూడ చిన్నపాటి గ్రామంలో సిడాం భీంరావు, ఆత్రం రాము ఇండ్లు కూలిపోగా, ఆత్రం బారిక్‌రావు, ఆత్రం కాశీరాం ఇండ్ల పైరేకులు లేచిపోయాయి. ఇంట్లోని చిరుధాన్యాలు తడిసిముద్దయ్యాయి.

కుంటాల మండలంలో..

కుంటాల: మండలంలో బుధవారం సాయంత్రం అరగంట పాటు ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. మండలంలోని కల్లూర్, కుంటాల, ఓలా, లింబా(కే), లింబా(బీ), కుంటాల, అంబకంటి, పెంచికల్‌పాడ్, అందాకూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. కుంటాల, పెంచికల్‌పాడ్ కొనుగోలు కేంద్రాల్లో తరలించేందుకు సిద్ధంగా ఉన్న జొన్న కుప్పలు తడిసిపోయాయి. కల్లూర్, ఓలా, కుంటాల గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి. ఓలాలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడగా రాథోడ్ దాదారావు ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఇదే గ్రామానికి చెందిన రుక్మ ఇంటి పైనున్న రేకులు లేచిపోయి ఇంట్లోకి వర్షపు నీరు చేరింది.

ఖానాపూర్ మండలంలో..

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. గన్నీ సంచుల కొరత కారణంగా అధికారులు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతోనే తాము నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్మల్ పట్టణంలో..

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం చిన్నపాటి వర్షం కురిసింది. స్థానిక రాంరావ్ బాగ్‌లో డ్రైనేజీలు నిండి ఇండ్ల ఎదుట వర్షపునీరు నిలిచి స్థానికులు ఇబ్బంది పడ్డారు.

బోథ్ మండలంలో..

బోథ్: మండలంలోని మర్లపెల్లి, నిగిని, కంటెగాం, నక్కలవాడ తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్లు పడిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచింది. పలు గ్రామాల్లో చేతికందే జొన్నపంట నేలకొరిగింది. బోథ్ మార్కెట్ యార్డుకు రైతులు విక్రయానికి తెచ్చిన జొన్న పంట తడిసిపోయింది.

తాంసి, భీంపూర్ మండలాల్లో..

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో బుధవారం సాయంత్రం గంటకు పైగా గాలివాన కురిసింది. తాంసి మండలంలోని తాంసి, వడ్డాడి, జామిడి, హస్నాపూర్, గిరిగాం, కప్పర్ల, గోట్కూరి, సావర్గాం, భీంపూర్ మండలంలోని నిపాని, భీంపూర్, వడూర్, పిప్పల్‌కోటి, తాంసి(కే) గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. తాంసి మండల కేంద్రంలో కుంటాల రమేశ్ ఇంటిపై తాటిచెట్టు విరిగిపడింది. ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఉండం సమీపంలో 33కేవీ విద్యుత్ స్తంభం విరిగిపడి తాంసి, తలమడుగు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచింది. తాంసి మార్కెట్ సబ్ యార్డుకు రైతులు విక్రయానికి తెచ్చిన జొన్నపంట తడిసిపోయింది.

నేరడిగొండ మండలంలో..

నేరడిగొండ: మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి పాత జాతీయ రహదారి అయిన వాంకిడి జాతీయ రహదారిపై రెండు వృక్షాలు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. 44వ జాతీయ రహదారి వరకు ప్రయాణికులు కాలినడకన వచ్చారు. గ్రామస్తులు, అధికారులు స్పందించి జేసీబీ సాయంతో వృక్షాలను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడింది.

ఇంద్రవెల్లి మండలంలో..

ఇంద్రవెల్లి: మండలంలోని అంజీ, మామిడిగూడ, వడగామ్, వాల్గొండ, పిట్టబొంగరం, తేజాపూర్, సాలేగూడ, పొల్లుగూడ, హర్కపూర్, పాటగూడ, మోడిగూడ, లింగాపూర్ గ్రామాల్లో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి ఇండ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. వడగామ్ రింగ్ రోడ్‌పై చెట్లు విరిగి పడిపోవడంతో రాకపోకలకు అంతరాయమేర్పడింది. స్థానికులు రోడ్డుపై పడిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.



ఖానాపూర్: మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం



తలమడుగు: పునగూడలో ఇంటిపై పడ్డ స్తంభం



ఉట్నూర్‌రూరల్: చిన్నుగూడలో కూలిన ఇల్లు